క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

దర్శి: జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపరిచి దర్శి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో ఆర్‌వీ నవ్య 100 మీటర్ల విభాగంలో మొదటి స్థానం, అమృత ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, కె.రమ్య 400 మీటర్లలో మూడో స్థానం సాధించి ప్రతిభ కనబరిచారు. వీరు నవంబర్ 3,4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రిన్సిపాల్ షేక్ హసీనాభాను, ఫిజికల్ డైరెక్టర్ ఎస్. ఓబుల పతి, పీడీలు క్రీడాకారులను అభినందించారు.

154 మంది యువకుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ నాగరాజు

యర్రగొండపాలెం: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 154 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు రక్తదాతలను అభినందించారు. రక్తదానం చేయడంలో యర్రగొండపాలెం జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. వైద్యాధికారి డాక్టర్ యదిద్యా దాతల నుంచి రక్తాన్ని సేకరింపచేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్సై చౌడయ్య పాల్గొన్నారు.

మోటారు సైకిలిస్టుకు గాయాలు



గాయపడిన హరీష్

ముండ్లమూరు (దర్శి): మండలంలోని వేంపాడు సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పి కొనికె హరీష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ముండ్లమూరు నుంచి అద్దంకి వైపునకు మోటారు సైకిల్‌పై హరీష్ వెళ్తున్నాడు. మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనానికి స్థానికులు సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- ఇరుకు గదులు, అరకొర సౌకర్యాలు
- చాలా కేంద్రాల్లో నీటి సౌకర్యం నిల్
- ఇబ్బందులు పడుతున్న బాలింతలు, గర్భిణులు

యర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలో కేంద్రాలు	248
సొంత భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు	64
అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు	94
అద్దె లేని కేంద్రాలు	90



గిరిజన తండాలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

పుల్లలచెరువు: గర్భిణులకు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించి మాతా శిశు మరణాలను నివారించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో గతంలో ఏ ప్రభుత్వం చేయని మంచి పని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసింది. పిల్లలకు ప్రీస్కూల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు చాలీచాలని అద్దె భవణాల్లో కొనసాగుతుండటంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఆశించిన మేర అంగన్‌వాడీ సేవలు అందని పరిస్థితి. యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో 248 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. యర్రగొండపాలెం మండలంలో 32, పుల్లలచెరువు-30. త్రిపురాంతకం-28 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. అద్దెలు లేకుండా కొన్ని చోట్ల, కొన్ని అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి అద్దె కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.వేయి నెంచి రెండు వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది.

వసుతులు లేక ఇబ్బందులు

నియోజకవర్గంలో ఉన్న చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో గాలి, వెలుతురు సరిగా లేని ఇరుకు గదుల్లో కేంద్రాలు నిర్వహిస్తుండటంతో కార్యకర్తలు, లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్ని చోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటివి కూడా లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాల చుట్టూ పిచ్చి మొక్కలు పేరడంతో ఎక్కడ విషపురుగు వస్తాదోనని కొందరు చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీలకు పంపని పరిస్థితి ఉంది.

> **అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
> ప్రాజెక్టు పరిధిలో చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంగతి అధికారులకు తెలియజేశాం. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మరికొన్ని చోట్ల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
> – పద్మావతి, సీడీపీవో, యర్రగొండపాలెం



> **ప్రభుత్వం స్పందిస్తే మంచిది**
> చిన్నారులు విద్య నేర్చుకునే అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు అనేకం ఉన్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో పాటు నీరు, మరుగుదొడ్లు లేక కేంద్రాలకు వచ్చే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులకు అన్ని వసుతులతో కూడిన భవనాలు ఉంటే వారికి సౌకర్యంగా ఉంటుంది. అధికారులు స్పందించి అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.
> – ఎల్.నాగమ్మ, మాజీ సర్పంచ్, పుల్లలచెరువు

అంత్యక్రియలకు డ్రైవర్స్ అసోసియేషన్ సాయం



మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న షెక్షావలి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీ బేస్త వీధికి చెందిన మీనిగ నాగేశ్వరరావు (40) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం మృతి చెందాడు. మండల కేంద్రంలో దినసరి కూలీగా పనుల చేస్తూ కుటుంబ పోషణ చేసుకునే నాగేశ్వరరావు మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అందిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం సుందరయ్య కాలనీకు చెందిన నాగేశ్వరరావుకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. చికిత్స కోసం కర్నూల్‌లోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు ఆరోగ్యం విషమించంతో మృతి చెందాడు. నాగేశ్వరరావు మరణవార్త విన్న సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి.. మృతుడి భార్య రామానుజమ్మకు అంత్యక్రియల కోసం 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు కుటుంబానికి అవసరమైన సాయాన్ని అందిస్తానన్నారు. సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు సర్దార్, దాసు, వీరయ్య, శివ, రాజు, విష్ణు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం



శ్రీశైలం ఘాట్‌లో డివైడర్‌ను ఢీకొన్న కారు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న 108 సిబ్బంది

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు
- మూడేళ్ల చిన్నారితో సహా ఐదుగురికి గాయాలు

పెద్దదోర్నాల: అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో మూడేళ్ల చిన్నారితో సహా ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో శ్రీశైలం ఘాట్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం జరిగింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పీఠాపురం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తున్న కారు అదుపుతప్పి చిన్నారుట్ల సమీపంలోని ఆంజనేయస్వామి వద్ద డివైడర్‌ను ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పిఠాపురానికి చెందిన మూడేళ్ల చిన్నారి జవ్వాడి ప్రవల్లికశ్రీ, జవ్వాడి వెంకట సత్యారావు, జవ్వాడి శార్వాయి గణేష్, శాయిదీప్తి, జవ్వాడి అప్పాయమ్మలు గాయపడ్డారు.

విషయం తెలుసుకున్న శ్రీశైలం 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ప్రమాదంలో గాయపడిన చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టనున్నారు.

బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి



దొనకొండలో శిఖామణికి గిఫ్ట్ అందిస్తున్న డివిజనల్ మేనేజర్



పెద్దదోర్నాల: ఖాతాదారుల సమావేశంలో పాల్గొన్న డివిజన్ మేనేజర్

దొనకొండ: ఖాతాదారుడు లేనిది బ్యాంక్ లేదని, ప్రతి ఖాతాదారుడు కెనరా బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ ఒంగోలు ఆర్‌ఓ డివిజనల్ మేనేజర్ రమేష్ రామస్వామి అన్నారు. స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజనల్ మేనేజర్ హాజరై మాట్లాడారు. కెనరా బ్యాంక్ ఖాతాదారులకు అనేక ప్రయోజనాలు చేకూరుస్తోందని, అందులో భాగంగా ఏటీఎం కార్డు విత్‌డ్రా ఫ్రీగా, మొబైల్ బ్యాంక్ ఫ్రీ, ఆన్‌లైన్ బుకింగ్ సేవలు ఫ్రీగా ఖాతాదారులకు అందిస్తోందన్నారు. అంతేకాకుండా గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ రుణాలు, చిరువ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోందని, ముఖ్యంగా బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తోందన్నారు. మేనేజర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కెనరా బ్యాంక్ జిల్లాలో 46 బ్రాంచ్‌లు ఉన్నాయని, అందులో దొనకొండ ఒకటని, 22 వేల మంది ఖాతాదారులు ఉన్నారని, 3 వేల మంది పింఛనర్స్‌కు సేవలందిస్తోందని చెప్పారు. అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకే అందిస్తోందని, తమ సిబ్బంది ఖాతాదారులతో అనుకూలంగా ఉండి వెంటనే పని చేస్తున్నారన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాలు తక్కువ వడ్డీకి అందిస్తున్నామని, 500 మంది రైల్వే పింఛనర్స్ సేవలు పొందుతున్నారని మేనేజర్ తెలిపారు. ఖాతాదారులు వారి సమస్యలను వివరించారు. సిబ్బందిని పెంచాలని డివిజనల్ మేనేజర్‌కు ఖాతాదారులు వివరించారు. అనంతరం బ్యాంక్‌లో ఉత్తమ సేవలందించి ఖాతాదారుల మన్ననలు పొందిన టి.శిఖామణికి కెనరా బ్రాంచ్ అందించిన బహుమతి అందజేశారు. రైల్వే పింఛనర్స్ కార్యదర్శి కోలా కృపారావు, మాడిశెట్టి రమేష్, విప్పర్ల సుబ్బయ్య, శేఖర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: బ్యాంకు ఖాతాదారుల శ్రేయస్సే తమ ముఖ్య ఉద్దేశమని డివిజన్ మేనేజర్ నగేష్ పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాదారుల సమావేశాన్ని స్థానిక కెనరా బ్యాంకులో సోమవారం నిర్వహించారు. ఖాతాదారులను ఉద్దేశించి నగేష్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు అందించడంలో తమ బ్యాంకు అగ్రగామిగా ఉందన్నారు. తమ బ్యాంకు రిజర్వ్ బ్యాంకు అధీనంలో ఉంటుందని, ఒకరి దగ్గర తక్కువ వడ్డీ, మరొకరి దగ్గర ఎక్కువ వడ్డీ తీసుకునే ప్రసక్తే ఉండదన్నారు. మనం ఏ లోన్ తీసుకున్నా వాయిదాలు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాడు అందించాలన్నారు. తమ బ్యాంకు కష్టమర్లకు తోడ్పాటు అందిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన బ్యాంకన్నారు. కెనరా బ్యాంకు 21 లక్షల కోట్ల వ్యాపారం చేసినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న బ్యాంకుల్లో తమ బ్యాంకు మూడో బ్యాంకని కొనియాడారు. బ్రాంచ్ మేనేజర్ మురళీ కృష్ణ, మేనేజర్ వికాస్, ఏపీఎం పోలయ్య, ఖాతాదారులు గాంధీ, అంబటి వీరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యేదుల శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, రావిక్రింది రాజ, రమణయ్య, అమిరెడ్డి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

- పత్తాలేని అనుబంధ శాఖల అధికారులు



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన వ్యవసాయాధికారులు

పెద్దారవీడు: రైతుల పక్షపాతిగా చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలతో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆదిలోనే తుస్సుమంటోంది. పొలం పిలుస్తోంది కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రచారం ఎక్కువ.. పని తక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజరవుతుండటంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది.

ఇదీ..కార్యక్రమం ఉద్దేశం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు వ్యవసాయాన్ని తగ్గించడం, మెరుగైన సాగు పద్ధతులను అవలంబించడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఉత్పాదకతను పెంచడం, సాగు వ్యయాన్ని తగ్గించడం, వ్యవసాయంలో రైతుల అదాయ స్థాయిలను పెంచడం వంటి వాటిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. రైతులు, శాస్త్రవేత్తలు నేరుగా ఇంటరాక్ట్ అవడం ప్రధాన ఉద్దేశం. ఇందుకుగానూ ప్రతి వారం మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించాలి.

పత్తాలేని అనుబంధ శాఖలు

ఈ కార్యక్రమాలకు వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆత్మ, ఏపీ సీఎస్ఎఫ్, ఉద్యానశాఖ, సెరీకల్చర్, పశుసంవర్ధక శాఖ, ఏపీ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేషన్ ఫెడరేషన్, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెటింగ్‌తో పాటు కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం ఇలా పదికిపైగా శాఖలు హాజరు కావాల్సి ఉంది. కానీ వ్యవసాయ శాఖతో పాటు అప్పుడప్పుడూ పశుసంవర్ధక, ఉద్యానవన, సేరికల్చర్ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రమే హాజరవుతున్నారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులే నిర్వహించి ఫ్లెక్సీలతో ఫొటోలు దిగి మమ అనిపించేస్తున్నారని రైతులు చెబుతున్నారు. రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి, మిరప, పొగాకు, కంది, వరి, టమోటా, దోస తదితర పంటలు సాగు చేశారు. ఇప్పటికే వర్షాలు కురవడంతో వైరస్, కొమ్మ, కుళ్ల తెగుళ్లతో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సలహాలు, సూచనలు ఇవాల్సిన అధికారులు పొలం పిలుస్తోందికి ఎగనామం పెడుతుండటం విమర్శలకు దారితీస్తోంది.

> **జిల్లా వ్యవసాయాధికారికి తెలియజేశాం:**
> పొలం పిలుస్తోంది కార్యక్రమానికి అన్ని అనుబంధ శాఖల అధికారులు కచ్చితంగా హాజరు కావాలి. కానీ కొన్ని శాఖలు హాజరు కావడం లేదు. అనుబంధ శాఖల అధికారులకు షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని తెలియజేస్తున్నాం. హాజరు కావాల్సిన బాధ్యత అన్ని అనుబంధ శాఖలపై ఉంది. కార్యక్రమానికి రాని శాఖలను బలవంతం చేయలేము కదా. ఇదే విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి కూడా తీసుకెళ్లాం.
> – కె.బుజ్జిబాయి, మండల వ్యవసాయాధికారి

వెలుగొండకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలి





దొనకొండ, త్రిపురాంతకంలో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందిస్తున్న సీపీఐ నాయకులు

దొనకొండ: పశ్చిమ ప్రకాశంలో నిర్మాణంలో ఉన్న వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు తక్షణమే కేటాయించి పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేయాలని సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో రమేష్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగి 30 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తి కాక పోవటం పాలకులకు జిల్లాపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరిందని, వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లకు చేరిందని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కేటాయించి నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయించి ప్రాజెక్టులో నీరు నింపాలని కోరారు. మండల కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో కెనాల్స్‌ను తవ్వి చిన్న కాలువల ద్వారా నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసి సంబంధిత చెరువులు నింపాలన్నారు. దొనకొండ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అనంతరం తహసీల్దార్ బి.రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, సీపీఐ దర్శి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కూరేటి బాలయ్య, సీపీఐ నాయకులు రామాంజి, బి.మరియదాసు, సీహెచ్ లక్ష్మీదేవి, బాలయ్య, ఏసులు, ముసలయ్య, పెద్ద వెంకటయ్య, అంకయ్య పాల్గొన్నారు.

త్రిపురాంతకం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణశివప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతపత్రం సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో 7,500 మంది నిర్వాసితులు ఉన్నారని, తక్షణమే నిధులు మంజూరు చేసి వారికి అందజేయాలని, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టు కెనాల్ పనులు పూర్తి చేయాలని, కెనాల్స్‌కు అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయడంతో పాటు ప్రాజెక్టుకు నిఖర జలాలు కేటాయించాలని జీఓ చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ నాయకులు డి.శ్రీనివాస్, బాణాల రామయ్య, ఖాసిం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన సాయి

ముండ్లమూరు (దర్శి): లారీ.. బొలెరో ఢీకొని సాయి అనే డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పసుపుగల్లులో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సాయి మినీలారీ తీసుకుని సీతాఫలం కాయలు తెచ్చేందుకు విజయవాడ నుంచి మదనపల్లి వెళ్తున్నాడు. పసుపుగల్లు వద్ద పామూరు నుంచి విజయవాడ వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొనడంతో మినీ లారీ నడుపుతున్న డ్రైవర్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు డ్రైవర్ సాయిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీ5 కాలువను పుల్లలచెరువుకు పొడిగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ కన్వీనర్ గురునాథం

పుల్లలచెరువు: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు టీ5 కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించాలని మండల సీపీఐ కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. సోమవారం మండల తహసీల్దార్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి వెలుగొండ ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పుల్లలచెరువు మండలంలో తాగు, సాగు నీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంతానికి వచ్చే టీ5 కాలువ పనులు సకాలంలో పూర్తి చేసి చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు నింపితే ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభించాలని కోరారు.

సత్వర చికిత్సే శ్రీరామరక్ష

- బ్రెయిన్ స్ట్రోక్‌పై వైద్య నిపుణుల సూచన
- నేడు బ్రెయిన్ స్ట్రోక్ డే



ఒంగోలు టౌన్: బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్రెయిన్ స్ట్రోక్‌ను సామాన్యుల పరిభాషలో పక్షవాతం అంటారు. దీని బారిన పడిన వారి జీవితం దుర్భరం అవుతుంది. ఒకచేయి, ఒకకాలు పని చేయకపోవడం, మాట రాకపోవడం లాంటి వాటితో ఇబ్బంది పడుతుంటారు. మారిన జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానం అలవాట్ల వలన బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మెదడులో రక్తం గడ్డకట్టడం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ తదితర కారణాల వలన కూడా బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడికి గురైన వారిలో మెదడులో రక్తం గడ్డకడుతుంది. దీనివలన మెదడులో రక్త ప్రసరణ సరిగా జరగదు. బీపీ అదుపులో లేకుండాపోవడంతో మెదడులోని నరాలలో రక్తస్రావం జరుగుతుంది. దీని వలన పక్షవాతం వస్తుంది. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు వెంటనే మద్యం, ధూమపానం అలవాట్లను మానివేయం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇందుకోసం ప్రత్యేక వైద్యం అందుబాటులో ఉంది. ప్రతిరోజూ ఇక్కడకు వైద్యం కోసం రెండంకెల్లో రోగులు వస్తున్నారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిన వారికి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. ప్రతి నెలా 200కుపైగా జీజీహెచ్‌లో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు సత్వర చికిత్సే శ్రీరామరక్ష అని వైద్యులు చెబుతున్నారు.

గోల్డెన్ అవర్‌లో చికిత్స చేయడం ప్రధానం

పక్షవాతం వచ్చిన వారిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వైద్యశాలకు తరలించాలి. దీనినే గోల్డెన్ అవర్ అంటారు. మనిషికి స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రతి నిముషం అత్యంత విలువైందని గుర్తించాలి. తక్షణమే పక్షవాతానికి చికిత్స చేయకపోతే మెదడు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ రోగులను సకాలంలో గుర్తించడం వలన ఎఫ్ఏఎస్‌టీ అనే విధానం ద్వారా చికిత్స చేస్తారు. దీని వలన ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. మెదడు దెబ్బతినకుండా కాపాడవచ్చు. సాధ్యమైనంత త్వరగా చికిత్సకు తీసుకెళ్తే ఆల్ట్‌ప్లెస్, లేదా టెనెక్టెప్లెస్‌తో థ్రోంబోలైటిక్ చికిత్స చేసి మెదడులో రక్తం గడ్డకట్టకుండా చేస్తారు. మరికొంత మందికి మెకానికల్ థ్రోంబెక్టమీ చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడతారు. అయితే, పక్షవాతం వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిమీద అవగాహన కలిగి ఉండాలి.



> **బ్రెయిన్ స్ట్రోక్‌కు ఆధునిక చికిత్స**
> బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడిన వారిని ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి. ఇప్పుడు అల్లోపతి వైద్యంలో ఎంతో మెరుగైన చికిత్స ఉంది. మెదడులో రక్తం గడ్డకట్టినప్పటికీ క్షణాల్లో కరిగించే వైద్యం అందుబాటులో ఉంది. ఆలస్యమయ్యేకొద్ది రోగి మరింత ప్రమాదంలో పడతాడు. చికిత్స కూడా కష్టతరమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. అంతకంటే ముందుగా వయసుతో నిమిత్తం లేకుండా మద్యపానం, ధూమపానం అలవాట్లను మానుకోవాలి. ఒత్తిళ్లకు దూరంగా ప్రశాంతంగా జీవించాలి. రక్తపోటు ఉన్నవారు అదుపులో ఉంచుకోవాలి.
> – డాక్టర్ కసుకుర్తి అనిల్‌కుమార్, న్యూరాలజిస్టు

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు...

- మొహం, చేయి, కాలు తదితర భాగాలలో తిమ్మిరి. ఆయా భాగాలు బలహీనంగా అనిపించడం..
- ఒక కన్ను లేదా రెండు కళ్లలో ఆకస్మికంగా చూపు మందగించడం..
- ఆకస్మికంగా మాటలు తడబడటం. మాట్లాడేటప్పుడు మూతి వంకర పోవడం. మాటలో తేడా స్పష్టంగా కనిపించడం..
- ఉన్నట్టుంది ఒక్కసారిగా భరించలేని తలనొప్పి..
- మైకం వచ్చినట్లు మనిషి నడకలో మార్పు. నడవడానికి ఇబ్బంది పడటం..